క్లుప్తంగా

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : బద్రిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని విశ్వనాథపురం, రాజకొట్టాలు గ్రామాలలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామాలలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

గడ్డివామి దగ్ధం

గోపవరం : మండలంలోని రాచాయపేటకు చెందిన మట్లివెంకటసుబ్బారెడ్డికి చెందిన గడ్డివామి మంగళవారం దగ్ధమైంది. రోడ్డు పక్కనే గడ్డివామి ఉండటంతో ఆకతాయిలు అగ్గి వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న బద్వేలు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసి పక్క గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదంలో రూ.20 వేలు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

పద్యాలను నేర్చుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల పద్యాలను, శతకాలను నేర్చుకోవాలని విశ్రాంత తెలుగు పండితుడు భాస్కర్‌రాజు పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను శతకాలు, పద్యాలను చెప్పారు. వేమన శతక పద్యాలను వాటి తాత్పర్యాలను భాస్కర్‌రాజు వివరించారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, పాఠశాల సిబ్బంది ఓబులేసు, రెహ్మాన్‌ఖాన్, శారద పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్‌ఏ నారాయణరెడ్డి అధ్యక్షతన 20న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

అందుబాటులో తపాల పార్శిల్ సర్వీసు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రధాన తపాల కార్యాలయంలో పార్శిల్ ప్యాకేజింగ్ సర్వీసును అందుబాటులోకి తెచ్చినట్లు ప్రధాన తపాల కార్యాలయం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ సర్వీసును వినియోగించుకోవాలని ఆయన కోరారు. వినియోగారుడు రశీదు, ఆన్‌లైన్ ట్రాకింగ్ పొందవచ్చునని పేర్కొన్నారు.

పద్యాలతో జీవితం పరిమళిస్తుంది

ప్రొద్దుటూరు : పద్యాలలోని విలువలతో జీవితం పరిమళిస్తుందని ప్రముఖ రచయిత, తెలుగు భాషోపాధ్యాయుడు డీకే చదువుల బాబు తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పద్యాలపై అవగాహన కల్పించారు. చక్కటి ఆదర్శవంతమైన జీవితానికి పద్యాలలోని సందేశాలు మైలురాళ్లుగా నిలుస్తాయని చెప్పారు. కథలను చెప్పి విద్యార్థులను ప్రశ్నించి అవగాహనను పరీక్షించారు. ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి బాలల గేయాలను పాడి విద్యార్థులతో పలికించారు. శ్రీకాంత్ స్పోకెన్ ఇంగ్లీషులో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, సంజీవరెడ్డి, గ్రంథాలయ హెల్పర్ గంగాదేవి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల అనుమతులు రద్దు చేయాలి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ స్థలాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలకు అనుమతులు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డికి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న బద్వేలు పట్టణంలో కొంత మంది కబ్జారాయుళ్లు విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారని, వీటికి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని, దీనిపై తక్షణమే విచారణ జరిపి ప్రభుత్వ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నరసింహ, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణ, ఏరియా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు టీడీపీ నేతల సస్పెండ్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, ఆమె భర్త టీఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దిన్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీ పదవ వార్డులో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు పరిధిలోని గుంటూరు కొట్టాలు, సరస్వతిపేట, పాతపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 1,20,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారని కొనియాడారు. ఎన్నికల సమయంలో చెప్పని అనేక హామీలను కూడా నెరవేర్చారని అన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ అనేక విప్లవాత్మకమైన మార్పులను తెచ్చారని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులను అందించారని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు చేసి ఆదుకున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్చారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా 90 శాతం కుటుంబాలు లబ్ధి పొందతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌కు అండగా నిలబడాలని, ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి తవ్వా చంద్ర ఓబుళరెడ్డి, వార్డు నాయకులు టీవై ఓబుళరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, జయరాంరెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, బొగ్గుల ఓబుళరెడ్డి, శేషారెడ్డి, ఆర్ల గంగయ్య, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, ఏఈ నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, ఎస్సీ విభాగం కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆనందంగా ఉన్నారు

మైదుకూరు : ఏ ప్రభుత్వంలో లేని విధంగా కేసీ కాలువకు ఏప్రిల్ వరకు నీళ్లు ఇవ్వడంతో రెండో పంట కూడా వేసుకున్న రైతులు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన మైదుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీ కాలువ ఆయకట్టుకు ఒక్క పంటకు నీళ్లివ్వలేని పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండగా, తమ ప్రభుత్వం రెండో పంటకు కూడా నీళ్లిచ్చిందన్నారు. రెండో పంటలో ఎకరాకు 40 బస్తాల ధాన్యం పండించిన రైతులు సుభిక్షంగా ఉన్నారని, గ్రామాల్లో జాతరలు జరుపుకొంటున్నారని తెలిపారు. మార్చి 31కి ముందు పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. మండలంలో నిర్మాణం పూర్తికాని అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే పూర్తి చేయిస్తామన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఉపాధి, ఇరిగేషన్, తెలుగుగంగ, కేసీ కాలువ, ఉద్యానశాఖ, ఐసీడీఎస్ అధికారులు తమ శాఖల ప్రగతిని సమావేశంలో వివరించారు. జెడ్పీటీసీ ప్రసన్న లక్ష్మి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీలు ఊటుకూరు రఘురామిరెడ్డి, నానుబాల చిన్న కొండమ్మ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, తహసీల్దార్ అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10లక్షలు



కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10లక్షలు ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని నంగనూరుపల్లె గ్రామంలో నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం రూ.10లక్షలు నగదును గ్రామస్తులకు అందించారు. చెప్పిన మేరకు మిగతా రూ.20లక్షలు జరుగుతున్న పనిని బట్టి త్వరలో చెల్లిస్తానని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ నంగనూరుపల్లె గ్రామస్తులందరూ ఏకపక్షంగా తనకు ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. ఇందుకు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. గ్రామస్తులు సామూహికంగా శుభకార్యాలు జరుపుకోవడానికి కల్యాణ మండపం కావాలని తనను కోరారన్నారు. ఈ మేరకు 50 సెంట్ల స్థలాన్ని రామలింగేశ్వస్వామి ఆలయం పక్కనే తయారు చేసుకున్నారన్నారు. మొత్తం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.60 లక్షల నుంచి రూ.70లక్షలు వ్యయం అవుతుందని, ఇందులో భాగంగా తన వాటా రూ.30లక్షలు చెల్లిస్తానని గతంలో మాట ఇచ్చానన్నారు. ఈ ప్రకారం తొలి విడతగా కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10లక్షలు చెల్లించానని, మిగతా రూ.20లక్షలు రెండు విడతలుగా చెల్లిస్తానన్నారు. ఆరు నెలల్లో మొత్తం నిర్మాణం పూర్తవుతుందన్నారు. తాను తొలి శుభకార్యానికి హాజరవుతానని ఎమ్మెల్యే తెలిపారు.

జగన్‌పై విష ప్రచారం

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీపై, ముఖ్యమంత్రి జగన్‌పై విషప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా టీడీపీ నాయకులు తమ ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారే తప్ప మా వైఫల్యాలు ఏమిటో చెప్పడం లేదన్నారు. చంద్రబాబు పరిపాలనను చూసి విసుగు చెందే ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారన్నారు. ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధితో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శావలి లక్ష్మీదేవి, ఎంపీటీసీ క్రిష్టిపాటి సంధ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ యాలం తులశమ్మ, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య పాల్గొన్నారు.

సమస్యలపై రాష్ట్రస్థాయి అధికారులకు ఎమ్మెల్యే వినతి



సమస్యలపై నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆయా శాఖల రాష్ట్ర అధికారులను తాడేపల్లిలో మంగళవారం కలిసి చర్చించారు. స్థానిక కోటవీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు నూతన భవనాలు మంజూరు చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మిని కలిసి విన్నవించారు. ఇక్కడ గతంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిని తరలించడం వలన సుమారు 30 గ్రామాల ప్రజలకు వైద్యసేవలు దూరమయ్యాయని వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నోడల్ ఆఫీసర్ త్వరలోనే భవనాల మంజూరుకు అనుమతి ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే బద్వేలు మున్సిపాలిటీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం 40 మంది పారిశుద్ధ్య కార్మికులను అదనంగా నియమించేందుకు అనుమతి ఇవ్వాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కోటేశ్వరరావును కలిసి విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సిబ్బంది నియామకానికి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, తదితరులు

బద్వేలు : కాశినాయన మండలంలోని కత్తెరగండ్ల పంచాయతీ పరిధి కొండపేట గ్రామానికి చెందిన పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సమక్షంలో మంగళవారం టీడీపీ నుంచి పార్టీలో చేరారు. భగీరథ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పంగా గురివిరెడ్డి, ఉప సర్పంచ్ సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ జాకోబ్ ఆధ్వర్యంలో నూనె రవి కుమార్, రవీంద్రబాబు, రామయ్య, సామేలు, చిన్నపుల్లయ్య, పెద్దపుల్లయ్య, ప్రభాకర్, జోషఫ్, దానమ్మ, శ్యామల, రాణెమ్మ తదితరులు పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చారని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

డ్రైడేను విధిగా పాటించాలి



వైద్యాధికారితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి

మైదుకూరు : ప్రతి శుక్రవారం డ్రై డేను అందరూ విధిగా పాటించేలా చూడాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని లెక్కలవారిపల్లె గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల నమోదు, గర్భిణుల, క్షయ వ్యాధిగ్రస్తుల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఫ్యామిలీ ఫిజిసియన్ కార్యక్రమ అమలును వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు డ్రై డేను పాటించేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తస్లీమ్ ఫాతిమా, మల్లేష్, తేజస్విత, ఎంపీహెచ్‌ఈఓ ప్రసాద్, సూపర్‌వైజర్ జనార్దన్ రావు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ ఏపీఎం రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభలో 2022-23 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సభలో రైతులు, ప్రజలు, సామాజిక కార్యకర్తలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలి

రాజుపాళెం : ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, ఆలీఖాన్, చంగలరెడ్డిలు మంగళవారం డిమాండ్ చేశారు. పాత ఉత్తర్వులు 54 ప్రకారం బదిలీలు జరిపితే న్యాయ సమస్యలు ఉండవని చెప్పారు.

విద్యార్థులకు కథల పోటీలు

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు డ్రాయింగ్, చదరంగం, కథల పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖాశింవలి, దాదాపీర్ బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో బయట తిరగడం, సెల్ ఫోన్లకు దాసోహమవడం ద్వారా విద్యార్థులు కాలాన్ని వృథా చేయకుండా సమ్మర్ క్యాంపులో పాల్గొని విజ్ఞానవంతులయ్యేందుకు పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహించేందుకు బహుమతులు ఇస్తున్నామన్నారు. గ్రంథాలయ అధికారి ఆఫ్రిది విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే వెలవలికి రాక

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామానికి బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రానున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్‌ఏ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు రావాలని చెప్పారు.

రిజర్వు ఫారెస్టులో పరిశుభ్రత పనులు



దూదెమ్మకోన దేవాలయం వద్ద చెత్తను తొలగిస్తున్న దృశ్యం


పోరుమామిళ్ల : లైఫ్ స్టైల్ ఫార్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోరుమామిళ్ల ఫారెస్టు సిబ్బంది మల్లెపల్లె రిజర్వు ఫారెస్టులో దూదెమ్మకోన దేవాలయం, కోనేటి బావిలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఆ ప్రాంతంలో పారవేసిన ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లు, పేపర్లు, చిత్తు కాగితాలు, చెత్తను ఊడ్చి కాల్చి వేశారు. ఊర్లలోనే కాకుండా అడవిలో కూడా అపరిశుభ్రతవల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ పేర్కొన్నారు. అడవిలో కూడా పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది కృష్ణయ్య, వెంకటేష్, కిశోర్, బేస్ క్యాంప్ సిబ్బందితో 'పర్యావరణం-జీవనశైలి' ప్రతిజ్ఞను శ్రీకృష్ణ చేయించారు.

ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్‌గా గోపవరం ప్రభాకర్‌రెడ్డి



గోపవరం : ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) స్టేట్ డైరెక్టర్‌గా బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలానికి చెందిన గోపవరం ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన రెండేళ్ళ పాటు కొనసాగనున్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ప్రభాకర్‌రెడ్డి గోపవరం సర్పంచ్‌గా, సింగిల్‌విండో అధ్యక్షుడుగా, మండలాధ్యక్షుడుగా కొనసాగారు. ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ నియామకానికి సహకరించిన ప్రభుత్వ సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డి, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణశాఖ ప్రభుత్వ సలహాదారు చల్లామధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి అభినందించారు.

జగనన్న కాలనీలకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

ప్రొద్దుటూరు : నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ ఎస్ఈ రమణ తెలిపారు. ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి మంగళవారం ప్రొద్దుటూరులో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు వేగంగా తీసుకోవాలని కోరారు. విద్యుత్ రెవెన్యూ బకాయిలను వసూలు చేయాలని, విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డెవలప్‌మెంట్ చార్జీలను తప్పనిసరిగా వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్ఈ రమణను సన్మానించారు. సమావేశంలో ఈఈ జి.శ్రీనివాసరెడ్డి, డీఈ ఎల్.ప్రతాప్‌రెడ్డి, ఏఈలు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం.. వానర కష్టాలు



పోలీసుస్టేషన్ ఆవరణలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద కొళాయిలో నీటిని తాగుతున్న వానరం



గోపవరం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో వాటర్ బాటిల్‌తో దాహం తీర్చుకుంటున్న వానరం

బద్వేలు అర్బన్ : మండుతున్న ఎండలకు పశుపక్ష్యాదులు అల్లాడిపోతున్నాయి. ఎండవేడిమితో గుక్కెడు నీటి కోసం అలమటిస్తున్నాయి. ఎక్కడైనా గుక్కెడు నీళ్ళు దొరికితే దాహం తీర్చుకునేందుకు పరితపిస్తున్నాయి. ఈ క్రమంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం వానరాలు దాహం తీర్చుకుంటూ సాక్షి కెమెరాకు చిక్కాయి. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలోని కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో ఉన్న నీటి ట్యాంకు వద్ద ఓ వానరం స్వయంగా కొళాయి తిప్పుకుని నీటిని తాగి దాహం తీర్చుకుంది. అలాగే గోపవరం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఓ ద్విచక్ర వాహనంలో ఉన్న వాటర్‌బాటిల్‌ను గమనించిన వానరం బాటిల్‌ను ఎత్తుకెళ్ళి మూత ఉండటంతో పలుమార్లు ప్రయత్నించి చివరకు అతికష్టం మీద మూత తొలగించి నీటిని తాగి దాహం తీర్చుకుంది.

గుంతచీపాడులో కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : మండలంలోని చియ్యపాడు పంచాయతీ పరిధిలోని గుంతచీపాడు గ్రామంలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కంటి వైద్యులు డాక్టర్ తేజ 55 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఆపరేషన్లు చేయిస్తామని వైద్యులు తెలిపారు.

ఏఐఐటీఏ అధ్యక్షుడిగా సయ్యద్ బాషా



నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన అనంతరం మాట్లాడుతున్న సయ్యద్ బాషా

ప్రొద్దుటూరు : ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ రజాక్ మంగళవారం స్థానిక జిన్నా రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఏఐఐటీఏ ప్రొద్దుటూరు శాఖ అధ్యక్షుడుగా సయ్యద్ బాషా (పెన్నానగర్ ఉర్దూ స్కూల్), కార్యదర్శిగా అబ్దుల్ ఖాదర్ (డీసీఎస్ఆర్ ఉర్దూ స్కూల్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా నజీర్‌బాషా, అబ్బాస్ ఆలీ వ్యవహరించారు. ఉర్దూ టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

దోమల నివారణతో డెంగీ దూరం



అట్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

బద్వేలు అర్బన్ : దోమల నివారణతో డెంగీని దూరం చేయవచ్చని, ఇందుకోసం ప్రతిఒక్కరు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి అనంతరం డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ లేకుండా డ్రైడే పాటించడం ద్వారా దోమల నివారణ చేయవచ్చన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలని సూచించారు. విపరీతమైన జ్వరంతో పాటు ఎముకలు, కండరాల్లో భరించలేనంత నొప్పి, వాంతులు, వికారం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకుని డెంగీ నిర్ధారణ తర్వాత చికిత్స తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో, నిల్వ నీటిలో దోమల లార్వాలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ అష్రాఫ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్‌రావు, శ్రీరాములయ్య, ఖాశీం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్లూరు: దోమల వ్యాప్తితోనే డెంగీ ఉధృతి చెందుతుందని ఉమ్మడి కడప జిల్లా హెచ్ ఎన్ -9 ఇంచార్జ్ అయ్యవారయ్య, సిద్దవటం సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అట్లూరు గ్రామంలోని పుర వీధులలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా దోమల నివారణ కోసం చుట్టు పక్కల ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే లార్వా ద్వారా దోమలు ఉత్పత్తి చెందుతాయన్నారు. రాత్రి వేళదోమలు కుట్టకుండా దోమతెరలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, పబ్లిక్ హెల్త్‌నర్సు లక్ష్మీదేవి, సూపర్‌వైజరు మాణిక్యమ్మ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : అందరి భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని కల్లూరు ప్రాథమిక వైద్యాధికారి మహాలక్ష్మి తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా సుబ్బారావు కొట్టాల, ఈశ్వరరెడ్డినగర్, పెన్నానగర్‌లలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలంతా దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల శుభ్రతతో పాటు వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని విజ్ఞప్తి చేశారు. దోమ పుట్టకూడదు- దోమ కుట్టకూడదు అని అధికారులు, సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, డాక్టర్ హనీఫ్ బాబా ఆధ్వర్యంలో కామనూరు గ్రామంలో ర్యాలీ చేశారు. అలాగే ఏకేరోడ్డు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌బాబు, సీఓ నాగజ్యోతి పాల్గొన్నారు.

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలలో మురికి నీరు నిల్వ ఉంచకూడదన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సమీర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.